క్లుప్తంగా

స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దేందుకు కృషి



రెవెన్యూ అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ లక్ష్మీదేవి

దేవరాపల్లి: రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మెలగాలని తహసీల్దార్ పి. లక్ష్మీదేవి సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. చెత్తా చెదారాలను తొలగించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతకు కొంత సమయం కేటాయించి, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సంకల్పానికి తన వంతుగా కృషి చేస్తానని రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి తహసీల్దార్ ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కె. అప్పారావు, ఆర్ఐ సతీష్, వీఆర్వోలు సిహెచ్. సూర్యనారాయణ, కనకారావు, దొర, కాసప్ప, జామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు



ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

కె.కోటపాడు: రైతులు భూవివరాలను ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు అన్నారు. మండలంలో రొంగలినాయుడుపాలెం రైతు సేవా కేంద్రంలో ఫార్మర్ రిజిస్ట్రీని శనివారం ఆయన పరిశీలించారు. పీఎం కిసాన్ రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రీని చేయించుకుంటే పంటకు ప్రభుత్వం అందిస్తున్న పెట్టుబడి సహాయం అందనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రీ పూర్తయిన రైతులకు 11 అంకెలతో కూడిన ఐడీ నెంబర్ కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, ఏఈవో లైలాదేవి తదితరులు పాల్గొన్నారు.

పప్పుశెట్టిపాలెంలో రీ సర్వే చేయాలని వినతి



ఆర్డీవో రమణకు వినతిపత్రం ఇస్తున్న గ్రామ రైతులు

గొలుగొండ: పప్పుశెట్టిపాలెం రెవెన్యూ పరిధిలో భూములకు రీ సర్వే నిర్వహించి న్యాయం చేయాలని గ్రామ రైతులు నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణను కోరారు. శనివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి రావడంతో రైతులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. జిరాయితీ భూములను 22ఏలో చేరడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. వెంటనే రీ సర్వే నిర్వహించి న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



పూజలు చేస్తున్న భక్తులు

కె.కోటపాడు: చౌడువాడలోని గవరపేటలో నూతన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టాపనా కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సాయిరాంశర్మ పర్యవేక్షణలో భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళల కోలాటం పోటీలను నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన కోలాటం గ్రూపు సభ్యులకు నగదు పురస్కారాన్ని నిర్వాహకులు అందించారు. స్వామివారిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, తదితరులు దర్శించుకున్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

బుచ్చెయ్యపేట: సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె బుచ్చెయ్యపేటలో నిర్వహించిన పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు. మండల పంచాయతీ అధికారి విజయలక్ష్మి, ఏఈ ప్రభు, ఈవో లవరాజు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ ‘జాగారం’..

- వర్షం కురిస్తే జాగారం గెడ్డ ఉధృతి
- నీట ముంపునకు గురవుతున్న పొలాలు
- ఏటా రైతులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



గెడ్డలో కొట్టుకుపోగా మిగిలిఉన్న రక్షణగోడ



గతేడాది సెప్టెంబర్‌లో వరి పొలాలపై ముంచెత్తిన జాగారం గెడ్డ



కొట్టుకుపోయిన రక్షణగోడను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

మాకవరపాలెం: ఏటా వర్షాకాలంలో మండలంలోని జి.కోడూరు రైతులకు కంటి నిండా నిద్ర ఉండదు. ఇక్కడ ఉధృతంగా ప్రవహించే జాగారం గెడ్డ వల్ల పంట భూములకు రక్షణ లేకుండా పోతోంది. వరద నీరు పొలాల్లోకి ప్రవహించి ఈ ప్రాంతంలోని అధిక శాతం పంటలు నష్టపోతున్నారు. అధికారులు తాత్కాలిక చర్యలతో చేతులు దులుపుకోవడం మినహా శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

పదేళ్లుగా జరగని శాశ్వత పనులు ..

జాగారం గెడ్డలో ప్రవహించే వరద నీరు రైతుల భూముల్లోకి వెళ్లకుండా గతంలో రక్షణ గోడ నిర్మించారు. అసంపూర్తిగా దీనిని నిర్మించి వదిలేయడంతో పదేళ్లలో రెండుసార్లు తుపాను వర్షాలకు కొట్టుకుపోయింది. రక్షణ గోడ లేకపోవడంతో పొలాల్లో నీటితో పాటు భారీగా ఇసుక మేటలు వేయడం, వరి, పెసర, మినుము, కూరగాయ పంటలు నీట మునిగి రైతులు నష్టపోతున్నారు. ఇంతటితో ఆగకుండా పొలాల్లో నుంచి రైతులు ధాన్యం, ఇతర పంటలను గ్రామానికి తీసుకువెళ్లేందుకు వేసిన మట్టి రోడ్డు సైతం కోతకు గురవుతోంది. ఈ పరిస్థితుల్లో ఏటా వ్యవసాయ ఉత్పత్తులు గ్రామానికి తీసుకువెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పరిశీలనతో సరిపెట్టిన అధికారులు..

ఏడాదిన్నర క్రితం కొట్టుకుపోయిన ఈ గెడ్డ రక్షణ గోడ కారణంగా గతేడాది సెప్టెంబర్‌లో కురిసిన తుపాను వర్షాలకు వరి పంట నీట మునిగింది. దీంతో మండల స్థాయి అధికారులంతా ఈ గోడను పరిశీలించారు. సుమారు ఆరు నెలలు కావస్తున్నా కొట్టుకుపోయిన రక్షణ గోడ నిర్మాణానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో అవస్థలు తప్పడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి ఈ వేసవిలోనే శాశ్వత పనులు చేపట్టాలని కోరుతున్నారు.

గెడ్డతో ఇబ్బందులు



జాగారం గెడ్డ వల్ల ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. అధికంగా వర్షాలు కురిస్తే గెడ్డ ఉధృతికి పొలాల్లోకి నీరు చేరడంతో పాటు ఇసుక మేటలు వేయడం వల్ల నష్టపోతున్నాం.

– తోట చిరంజీవి, రైతు, జి.కోడూరు

శాశ్వత పనులు చేయాలి



జాగారం గెడ్డ కారణంగా పొలాలకు ఎలాంటి నష్టం జరగకుండా శాశ్వత పనులు చేయాలి. తాత్కాలిక పనులతో తుపాను సమయంలో ఖర్చు చేసిన నిధులు నీటిపాలవ్వడం పరిపాటిగా మారింది. ఈ వేసవిలో పనులకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది కాబట్టి శాశ్వత పరిష్కారం చూపాలి.

– వేగి నూకరాజు, రైతు, జి.కోడూరు

సామరస్యంగా సమస్యల పరిష్కారం



సమావేశంలో తహసీల్దార్ రమేష్, ఎస్ఐ ధనుంజయ్

కె.కోటపాడు: గ్రామాల్లో భూ సమస్యలను ఇరువర్గాల వారు సామరస్య పూర్వక వాతావరణంలో పరిష్కరించుకుంటే సమస్యలు తలెత్తవని తహసీల్దార్ డి.రమేష్ అన్నారు. కె.కోటపాడు రెవెన్యూ కార్యాలయంలో శనివారం మండల స్థాయి సమన్వయ కమిటీ(ఎంఎల్‌సీసీ) సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్‌తో పాటు ఎస్ఐ ఆర్.ధనుంజయ్, ఎంపీడీవో సాంబశివరావు పాల్గొన్నారు. ఎంఎల్‌సీసీ కార్యక్రమానికి వివాదాలు ఉన్న గుల్లేపల్లి, ఆర్లి గ్రామాలకు చెందిన వారు హాజరయ్యారు. భూ రికార్డులను పరిశీలించి అర్హులకు తప్పకుండా న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



విగ్రహాలను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

గొలుగొండ: రావణాపల్లిలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు శనివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో గౌరీపరమేశ్వరుల విగ్రహాలను సారెతో ఊరేగింపు చేశారు. చుట్టుపక్కల గ్రామస్తులు సైతం తరలివచ్చారు. పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సమస్యలపై ఏకరువు

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాసు

చోడవరం: పలు సమస్యలపై సభ్యులు మండల సమావేశంలో ఏకరువు పెట్టారు. ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన చోడవరం మండల సమావేశం శనివారం జరిగింది. కొన్ని శాఖల అధికారుల నిర్లక్ష్యం పనితీరు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత ఎంపీడీవో ఆంజనేయులు మండల పరిషత్ నివేదికను చదివి వినిపించారు. అనంతరం శాఖల వారీగా పనితీరు నివేదిక ఉంచారు. రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల పనితీరుపై పలువురు సభ్యులు సమావేశంలో ఫిర్యాదు చేశారు. వీధి కుక్కల వల్ల ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని, వాటి వల్ల అనేక మంది గాయాల పాలయ్యారని వాపోయారు. వాటిని నిర్మూలించాలని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా నేటికీ మెయిన్‌రోడ్డు పనులు చేపట్టలేదని, పెద్ద పెద్ద గోతులు పడటంతో ప్రమాదకరంగా ఉందని ఆర్అండ్‌బీ అధికారుల తీరుపై ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. పలు గ్రామాల్లో మంచినీటి సమస్య ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరగా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సానుకూలంగా స్పందించారు. తహసీల్దార్ రామారావు, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, ఈవోపీఆర్డీ మహేష్, మండల పరిషత్ సూపరింటెండెంట్ అమ్మాజీ పాల్గొన్నారు.

పీసా చట్టంతో గిరిజనులకు మేలు



మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం: గిరిజనులకు మేలు చేయడం కోసమే పీసా చట్టం ఏర్పాటైందని తహసీల్దార్ ఏ వేణుగోపాల్ తెలిపారు. నాతవరంలో రెండో రోజు పీసా కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు బాధ్యతగా పని చేయాలన్నారు. పీసా చట్టం సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్న పాడేరు పీవోకే ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎం. మూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలికల రక్షణ కోసం అనేక చట్టాలు

నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు



విద్యార్థినులతో మాట్లాడుతున్న నర్సీపట్నం డీఎస్పీ శ్రీనువాసరావు

గొలుగొండ: బాలికల రక్షణ కోసం రాజ్యాంగంలో అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని నర్సీపట్నం డీఎస్పీ శ్రీనువాసరావు తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు ఆయన అవగాహన కల్పించారు. అజ్ఞాత వ్యక్తుల ప్రలోభాలకు ఎక్కడ తగ్గవద్దని తెలిపారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులు, తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మంచి విద్య నేర్చుకొని ఉన్నత స్థానాలకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామారావు, కేజీబీవీ అధికారి సుధ పాల్గొన్నారు.

తడిపొడి చెత్తతో సేంద్రియ ఎరువు

మాడుగుల: స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్రలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి. జయలక్ష్మి మాట్లాడుతూ తడిపొడి చెత్త వేరు చేయడం వల్ల సేంద్రియ ఎరువుగా తయారవుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎం. రామ్‌కుమార్, ఉపన్యాసకులు పైడిరాజు, రాజు షర్మిలశ్రీ, నారాయణ, అప్పలనాయుడు, నాగేశ్వరరావు, నాగేశ్వరావు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం: వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నిర్మూలించాలనే లక్ష్యంతో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరుతూ పోలీసులు, సీఎంఆర్ సిబ్బంది శనివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. టౌన్ స్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అబిద్‌సెంటర్, ఆర్డీవో కార్యాలయం మీదగా ఆర్టీసీ కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్‌ను ఉపేక్షించేది లేదన్నారు. మొదటిసారి పట్టుబడితే అపరాధ రుసుం విధిస్తామని, రెండోసారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. హెల్మెట్ మన తలకు రక్షణ కవచంలా పని చేస్తుందన్నారు. ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరే ముందు తనకు ఏమైనా హాని జరిగితే కుటుంబం అంతా బాధపడాల్సి వస్తుందనే విషయాన్ని గుర్తు తెచ్చుకోవాలన్నారు. ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో టౌన్ సీఐ జి.గోవిందరావు, ఎస్సైలు దామోదర్‌నాయుడు, రమేష్, ఉమామహేశ్వరరావు, రాజారావు, రామారావు, భీమరాజు, సీఎంఆర్ మేనేజర్ కాశీం, పోలీసులు, సీఎంఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి పథకాలపై దృష్టి సారించాలి



గొటివాడ అగ్రహారంలో మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి వీరునాయుడు

మాడుగుల: వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో మంచినీటి పథకాలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి కె. వీరునాయుడు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా ప్రతి పంచాయతీలో మొక్కలు నాటుకోవాలన్నారు. గ్రామాల్లో మంచినీటి పథకాల నిర్వహణ, పారిశుధ్యంపై ఆరా తీశారు. అంతకుముందు స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గొటివాడ అగ్రహారంలో పారిశుధ్య పనులు పరిశీలించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, తహసీల్దార్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణానికి కృషి



అవగాహన కల్పిస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శి మీరాభి



గాదిరాయిలో ర్యాలీ చేస్తున్న మహిళలు

దేవరాపల్లి: క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి ఎస్.కె. మీరాభి కోరారు. స్థానిక ఎస్సీ కాలనీలో మహిళలకు క్యాన్సర్ నివారణపై శనివారం ఆమె అవగాహన కల్పించారు. గర్భాశయ ముఖద్వార, రొమ్ము, నోటి క్యాన్సర్ లక్షణాలు, నివారణ జాగ్రత్తలను సమగ్రంగా వివరించారు. ముందస్తుగా పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది లీలా పాల్గొన్నారు.

గాదిరాయిలో అవగాహన ర్యాలీ

మాడుగుల: మండలంలో గాదిరాయి గ్రామంలో అంగన్‌వాడీ, ఆశాల ఆధ్వర్యంలో క్యాన్సర్ ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లులకు క్యాన్సర్ జాగ్రత్తలతో పాటు, ముందస్తు లక్షణాలు వివరించారు. పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీ, పీహో శ్రీదేవి, సూపర్‌వైజర్లు చిన్నమ్మలు, అంగన్‌వాడీ కార్యకర్తలు సూర్యమణి, రమ, మహిళలు పాల్గొన్నారు.

పరిశుభ్రంగా ఉంచండి

మాడుగుల/రూరల్: : కె.జె.పురం పీహెచ్‌సీ ఆవరణలో పరిశుభ్రం చేశారు. వైద్యాధికారులు ప్రసాదుపాత్రుడు, లీలాప్రసాదు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కింతలివల్లాపురంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి ఆధ్వర్యంలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎంఎల్‌హెచ్‌పీ భాగ్య, ఏఎన్ఎం, శ్రీదేవి పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీ



మానవహారంగా ఏర్పడిన మున్సిపల్ సిబ్బంది, స్వయం సహాయక సభ్యులు



రోలుగుంట చెత్తతో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి మనోహర్



వారాడలో డస్ట్ బిన్లను అందించి వివరిస్తున్న ఈవోపీఆర్డీ రమణి, కార్యదర్శి సరోజిని



గాంధీ గ్రామంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం



కె.జె.పురం పీహెచ్‌సీ ఆవరణలో శుభ్రం చేస్తున్న సీహెచ్‌వో, తదితరులు



తూటిపాలలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, స్థానికులు

నర్సీపట్నం: మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా మున్సిపల్, సచివాలయ, మెప్మా సిబ్బందితో శనివారం ర్యాలీ నిర్వహించారు. పెదబొడ్డేపల్లి కూడలిలో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛత ఆరోగ్యానికి శ్రేయస్కరమని నినాదాలు చేశారు. మున్సిపాలిటీ పరిశుభ్రంగా ఉండాలంటే అందరూ స్వచ్ఛత పాటించాలని కమిషనర్ పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు ఆధ్వర్యంలో కళాశాల పరిసరాలను శుభ్రపరుచుకున్నారు. ఆర్డీవో కార్యాలయం సిబ్బంది కార్యాలయ ఆవరణంను శుభ్రం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుకున్నారు.

మాకవరపాలెం: అందరూ పరిసరాల శుభ్రతను పాటించాలని మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్‌రావు సూచించారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో శనివారం చెత్తను తొలగించే పనులు చేపట్టారు. ఈతూటిపాలలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి, స్వచ్ఛ భారత్ కో ఆర్డినేటర్ రావాడ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.

రోలుగుంట: పరిసరాలు పరిశుభ్రతతోనే గ్రామాల్లో ఆరోగ్యం సాధ్యమని మండల ప్రత్యేకాధికారి జి.మనోహర్ అన్నారు. మండలంలో 24 పంచాయతీల్లోను శనివారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని స్థానిక అధికారులతో కలసి నిర్వహించారు. దీనిలో భాగంగా రోలుగుంటలో సర్పంచ్ కొప్పుల వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పాల్గొన్నారు. స్థానిక చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వర్రావు, తహసీల్దార్ నాగమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు, పంచాయతీ కార్యదర్శి మట్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

కె.కోటపాడు: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగ్గా ఉంటే ప్రజలకు అంటువ్యాధులు దరి చేరవని ఈవోపీఆర్డీ రమణి, పంచాయతీ కార్యదర్శి బి.సరోజిని తెలిపారు. వారాడ గ్రామ సచివాలయం, హెల్త్ వెల్‌నెస్, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో శుభ్రం చేశారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల్లో చెత్తను ప్రజలు, గ్రీన్ అంబాసిడర్ల భాగస్వామ్యంతో తొలగించారు. ప్రజలకు డస్ట్‌బిన్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి పాల్గొన్నారు.

చోడవరం రూరల్: మండలంలోని గాంధీ గ్రామంలో చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి, ఎన్ఎస్ఎస్ పీవోలు బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి ఆధ్వర్యంలో వీధులలో విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టి ప్రదర్శన నిర్వహించారు. పలు ప్రాంతాలను ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుభ్రం చేసారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు వి.అప్పలనాయుడు, ఎస్ఎం రఫీయుద్దీన్, రాధాకృష్ణ, జ్యోతి, లక్ష్మీమంగమ్మ, నారాయణమూర్తి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, పి.డి.మూర్తి తదితరులు పాల్గొన్నారు.